క్లుప్తంగా

కలెక్టర్ ఆదేశాలతో వసతి గృహాల్లో మరమ్మతులు

ఏలూరు (టూటౌన్): కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉత్తర్వులు మేరకు అమీనాపేటలోని వసతి గృహాల సముదాయానికి సంబంధించి పరిసరాల శుభ్రత, వసతి గృహాల మరమ్మతులు నిర్వహించారు. ఈ మేరకు మున్సిపల్ కార్మికులతో పరిసరాలను శుభ్రం చేయించడం, మురుగు కాలువలల్లోని పూడికలను తీయించడంతోపాటు ప్రాంగణంలో అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించినట్టు జిల్లా బీసీ సంక్షేమాధికారి ఆర్వీ నాగరాణి తెలిపారు. ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహం–1లో పాడైపోయిన 3 మరుగుదొడ్ల తలుపులు, ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహం– 2లో పాడైపోయిన 6 మరుగుదొడ్ల తలుపులు స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసినట్టు బీసీ సంక్షేమాధికారి నాగరాణి తెలిపారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం



విద్యార్థినులకు ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత చైర్‌పర్సన్ అడుసుమిల్లి నిర్మల

ఏలూరు (టూటౌన్): విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని మానవత చైర్‌పర్సన్ అడుసుమిల్లి నిర్మల అన్నారు. స్థానిక సంస్థ కార్యాలయంలో ఇద్దరు పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. బీటెక్ మూడో సంవత్సరం విద్యార్థిని నందిన వర్షితకు రూ.20 వేలు, మొదటి సంవత్సరం విద్యార్థిని కూర్మా సంధ్యకు రూ.10 వేలు చొప్పున అందించారు. ఈ సాయాన్ని అమెరికాలో ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నర్రా వసుమతి, మాగంటి శ్రీవల్లి అందించినట్టు ఈ సందర్భంగా నిర్మల తెలిపారు. ఈ కార్యక్రమంలో మాగంటి శ్రీవల్లి, సంస్థ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎం.అజయ్‌బాబు పాల్గొన్నారు.

జనార్ధన స్వామి దేవస్థానం ఈవోగా నాగబాబు



ఈవో నాగబాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని జనార్ధన, నగరేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా సీహెచ్‌వీ నాగ మునేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా ప్రస్తుతం పని చేస్తున్న జి. రామపెద్దింట్ల రావును పోడూరుకు బదిలీ చేసి నాగమునేశ్వర రావును ఈ ఆలయానికి ఈఓగా నియమించారు. సోమవారం నాగబాబు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు, భక్తుల సహకారం తీసుకుంటామని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ ఆలయంలో సంప్రదాయబద్ధంగా ఏటా నిర్వహించే ఉత్సవాలను మరింత వైభవంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

- వేసవిని తలపిస్తున్న ఎండలు
- పగటి పూట అల్లాడుతున్న జనం
- సాయంత్రం చెదురుమదురు జల్లులు
- వైవిధ్యమైన వాతావరణంతో జ్వరాల బెడద
- జ్వర పీడితులకు కీళ్ల నొప్పులు



సోమవారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్



ఎండ వేడిమికి అవస్థ పడుతూ ప్రయాణం

ఏలూరు (టూటౌన్): విచిత్రమైన వాతావరణ పరిస్థితులతో నగర వాసులు ఇబ్బందులు పడుతున్నారు. మండు వేసవిని తలపించే విధంగా ఎండలు తారెత్తిస్తున్నాయి. దీంతో వర్షాకాలంలో ఈ ఎండలు ఏమిటిరా బాబు అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. మరో పక్క సాయంత్రం అయ్యే సరికల్లా వాతావరణం ఒక్కసారిగా చల్లబడి ఎక్కడో ఒక చోట చిరు జల్లులు కురుస్తున్నాయి. మొత్తంగా కొద్ది రోజుల నుంచి వైవిధ్యమైన పరిస్థితులు కన్పిస్తుండటంతో ప్రజల్లో అయోమయం నెలకొంది. సాధారణంగా అక్టోబరులో అడపా దడపా వర్షాలు పడుతూ శీతల గాలి తిరుగుతుంది. దానికి భిన్నంగా ప్రస్తుతం వేసవి కాలంలో మాదిరిగా ఉదయం ఏడు గంటలకే ఎండ తీవ్రంగా ఉంటోంది. దీంతో ఒకటే చెమటలు, ఉక్కబోతతో ప్రజలు అల్లాడుతున్నారు. సాధారణ వాతావరణమే కదా అన్నట్లు వివిధ పనులపై బయటకు వస్తున్న ప్రజలు బయట ఎండ తీవ్రతను చూసి హడలి పోతున్నారు. దీంతో మండు వేసవి మాదిరిగా మధ్యాహ్నం సమయంలో రోడ్లమీదకు రావాలంటే ప్రజలు హడలి పోతున్నారు. ఎవరి నోట విన్నా ఈ రోజు ఎండ తీవ్రత అధికంగా ఉంది కదా అంటూ చర్చించుకోవడం కనిపిస్తోంది.

ఒక్కోసారి 40 డిగ్రీలకు చేరుతున్న ఉష్ణోగ్రతలు

సాధారణంగా అక్టోబరులో ఉష్ణోగ్రతలు 35 నుంచి 37 డిగ్రీల వరకే నమోదవుతుంటాయి. దానికి భిన్నంగా ప్రస్తుతం 38 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీనిని బట్టి ఎండల తీవ్రత ఏ మేరకు ఉందనేది అర్థమవుతుంది. వాతావరణంలోని సమతుల్యత దెబ్బతినడం వల్లే ఇటువంటి వైవిధ్యమైన పరిస్థితులు కన్పిస్తున్నాయనేది నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితి ఇలాగే మరికొన్ని రోజులు ఉండవచ్చుననే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎన్నడూ లేని విధంగా కీళ్ల నొప్పులు

వాతావరణంలోని విభిన్న పరిస్థితుల వల్ల బయట అధికంగా తిరిగే వారు కొద్ది సేపటికే అలసిపోవడం, ఒక్కో సందర్భంలో జ్వరాల బారిన పడుతుండటం పరిపాటిగా మారింది. జ్వర బాధితుల్లో ఎన్నడూ లేని విధంగా విచిత్ర అనారోగ్య పరిస్థితులు కన్పిస్తున్నాయి. జ్వరం తగ్గినా దాని ప్రభావం వల్ల బాధితులకు కీళ్ల నొప్పులు వచ్చి నెల నుంచి రెండు నెలల పాటు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో జ్వర బాధితులు డాక్టర్ల వద్దకు పరుగులు పెడుతున్నారు.

జ్వర పీడితులు ఆందోళన చెందవద్దు



గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రస్తుత సీజన్లో జ్వరాల బారిన పడిన వారికి జ్వరం తగ్గిన తరువాత కీళ్ల నొప్పులు వస్తున్నాయి. సాధారణంగా జ్వరం వచ్చి తగ్గిన తర్వాత కొన్ని రోజులు నీరసంగా ఉండటం పరిపాటిగా ఉండేది. దానికి భిన్నమైన సమస్యలతో జ్వర బాధితులు ఇబ్బంది పడుతున్నారు. వైద్య పరిభాషలో దీన్ని వైరల్ ఆర్థరైటిస్‌గా భావిస్తున్నాం. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, ఇది తాత్కాలికమే. నొప్పులు క్రమేణా తగ్గుతాయి.

– డాక్టర్ బి.కృష్ణ,ఎండీ, శ్రీకృష్ణ హాస్పిటల్స్, ఏలూరు

విభిన్న వాతావరణంతో ఇబ్బంది పడ్డా



ప్రస్తుత సీజనల్‌లోని విభిన్న వాతావరణం కారణంగా అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మాలాంటి పని చేసుకునేవారికి బయటకు వెళ్లందే రోజు గడవదు. ఈ కారణంగా బయట ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా వెళ్లాల్సిన పరిస్థితి వారిది. ఇలా కొన్ని రోజులు గడిచే సరికి జ్వరం వచ్చింది. జ్వరం తగ్గినా ఒళ్లంతా ఒకటే నొప్పులు వేధించాయి. దీనివల్ల ఎంతో శ్రమ, వ్యయం వెచ్చించాల్సి వచ్చింది. పనులకు వెళ్లలేక ఇబ్బందులు ఎదుర్కొన్నాను.

– బొల్లారపు నాగరాజు, గొల్లాయగూడెం, ఏలూరు

దుండగులపై కేసు నమోదు చేయాలి

పంచాయతీ వద్ద శిలాఫలకం ధ్వంసంపై ఏఎస్పీకి ఫిర్యాదు



ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ సూర్యచంద్ర రావును కలిసిన సంతోష్‌కుమార్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా దెందులూరు మండలం ముప్పవరం గ్రామ పంచాయతీ కార్యాలయానికి ఉన్న శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దుండగులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఎస్సీ సర్పంచుల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్‌కుమార్ కోరారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నూతనంగా అదనపు ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన నక్కా సూర్యచంద్రరావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా తమ గ్రామంలోని సమస్యలపై జిల్లా అదనపు ఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. తమ గ్రామంలో సర్పంచ్, ఉప సర్పంచ్, ఏడుగురు వార్డు సభ్యులతో కూడిన శిలాఫలకాన్ని రాజకీయ కక్షతో కొంత మంది దుండగులు కావాలనే ధ్వంసం చేశారని తెలిపారు. ఈ సంఘటనపై 5న దెందులూరు పోలీసులకు ఫిర్యాదు చేశానని నిందితులను గుర్తించి, కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరారు. దీనిపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని లేని పక్షంలో ఎస్సీ సర్పంచుల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. దీనిపై స్పందించిన ఏఎస్పీ సూర్యచంద్రరావు పెదవేగి సీఐకు ఈ కేసు పరిష్కారానికి సూచనలు చేశారని తెలిపారు.

వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వివిధ అమ్మవార్ల ఆలయాల్లో శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఆయా ఆలయాల్లో అమ్మవార్లకు సోమవారం విశేష పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. స్థానిక పవర్ పేట కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారికి లలితా త్రిపుర సుందరి అలంకరణ చేశారు. స్థానిక బావిశెట్టివారి పేట కనకదుర్గ అమ్మవారికి వన దుర్గ అలంకరణ చేశారు. స్థానిక పవర్‌పేట శ్రీదేవి భూదేవి సమేత వాసుదేవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి లలితా త్రిపుర సుందరి అలంకరణ చేశారు. స్థానిక పత్తేబాద కనకదుర్గ అమ్మవారికి మహాచండీ దేవిగా అలంకరించారు.



లలితా త్రిపుర సుందరిగా కాశీ అన్నపూర్ణమ్మ



బావిశెట్టివారి పేటలో వన దుర్గగా అమ్మవారు



లలితా త్రిపుర సుందరి అలంకరణ



పత్తేబాదలో మహా చండీదేవి అలంకరణ

టీడీపీలో ముసలం

రాజీనామాకు సిద్ధమైన కార్పొరేటర్

ఏలూరు (టూటౌన్): అధికార టీడీపీలో ముసలం మొదలైంది. ఎన్నికలకు ముందు అధికార వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి చేరిన ఏలూరు నగరపాలక సంస్థకు చెందిన కార్పొరేటర్ ఒకరు తాజాగా తన పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. టీడీపీలో కీలక పదవిని ఆశించిన ఆ కార్పొరేటర్ ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన తర్వాత తాను ఆశించిన పదవి దక్కకపోవడంతో నిరాశ చెందినట్లు తెలుస్తోంది. ఇటీవల కొన్ని అంశాల్లో పార్టీ నాయకులతో ఆయనకు విబేధాలు పొడచూపడం కూడా మరొక కారణంగా చెబుతున్నారు. ఏదో ఆశించి గెలిచిన పార్టీకి నమ్మక ద్రోహం చేసిన ఆ కార్పొరేటర్‌కు టీడీపీలోనూ భంగపాటుకు గురికావడంతో నిరాశ నిస్పృహలతో రాజీనామా చేసేందుకు సిద్ధమైనట్లు సన్నిహితులు చెబుతున్నారు. ఇప్పటికే తన రాజీనామా లేఖను నగర కమిషనర్, మేయర్, స్థానిక ఎమ్మెల్యేకు ఆయన పంపించినట్లు చెబుతున్నారు. ఆ కార్పొరేటర్ రాజీనామా విషయాన్ని ఇంత వరకు ఎవరూ నిర్ధారించకపోవడం కొసమెరుపు. ప్రస్తుతం ఆ కార్పొరేటర్ పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిగా మారిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఏలూరులో రూ.9.50 కోట్లతో సింథటిక్ రన్నింగ్ ట్రాక్

- గత ప్రభుత్వ హయాంలో మంజూరు
- రూ.9.50 కోట్లతో ప్రణాళిక

ఏలూరు రూరల్ : ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో సింథటిక్ రన్నింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేసేందుకు రూపొందించిన ప్రణాళిక అమలు చేయనున్నామని ఏలూరు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకోసం ఎంపీ ల్యాండ్స్ నిధుల నుంచి రూ.2 కోట్లు మంజూరు చేయించాలని ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్‌ను కోరామన్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఈ పనులకు నిధులు సేకరించాలని కలెక్టర్ వెట్రిసెల్వి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ ఆదేశించారన్నారు. జిల్లా ప్రధాన కేంద్రమైన ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియంలో సింథటిక్ రన్నింగ్ ట్రాక్ అభివృద్ధి చేసేందుకు గతంలో రూ. 9.50 కోట్లతో ప్రణాళిక రూపొందించామన్నారు. ఇందులో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ నుంచి రూ.2.75 కోట్లు, ఏలూరు ఎంపీ ల్యాండ్స్ నుంచి మరో రూ.2 కోట్లు మంజూరు కావాలన్నారు. మిగిలిన 50 శాతం నిధులు రూ.4.75 కోట్లు ఖేలో ఇండియా పథకం నుంచి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఈ నిధులతో 400 మీటర్ల సింథటిక్ రన్నింగ్ ట్రాక్‌తో పాటు ట్రాక్ మధ్యలో షాట్‌పుట్, జావలిన్, డిస్కస్ ఏరియా అభివృద్ధి చేయాలన్నారు. ఈ పనులు పూర్తయితే స్థానిక ఖేలో ఇండియా సెంటర్ అథ్లెట్లతో పాటు జిల్లాలో సాధన చేస్తున్న అథ్లెట్లకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు.

23 నుంచి దీక్షాధారులకు భిక్ష ఏర్పాటు



ఉచిత భిక్షకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అన్నదాన సమాజం సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 23వ తేదీ నుంచి నగర పరిసర ప్రాంతాల్లో అయ్యప్ప దీక్షతో పాటు భవానీ, ఆంజనేయస్వామి, వేంకటేశ్వర స్వామి తదితర దీక్షలు తీసుకున్న స్వాములకు భిక్ష కార్యక్రమం ప్రారంభించనున్నట్లు అన్నపూర్ణ సహిత హరిహర పుత్ర అయ్యప్ప స్వామి అన్నదాన సమాజం అధ్యక్షుడు కొట్టు మధు తెలిపారు. స్థానిక రామకోటి ప్రాంగణంలోని శ్రీరామ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ సమాజం ఆధ్వర్యంలో గతేడాది నుంచి స్వాములకు భిక్ష కార్యక్రమం ప్రారంభించామని, దాని కొనసాగింపుగా ఈ ఏడాది ఈ నెల 23 నుంచి డిసెంబర్ 16వ తేదీ వరకూ 55 రోజుల పాటు ఈ ఉచిత భిక్ష కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజూ సుమారు 2 వేల మందికి భిక్ష వడ్డిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రారంభానికి ఈ నెల 12న పందిరి రాట వేస్తామన్నారు. ప్రజలు సైతం స్వాములకు భిక్ష పెట్టాలనుకుంటే ఒక రోజుకు రూ.10,116 కమిటీకి చెల్లిస్తే దాతలు కోరిన రోజున వారి పేరున స్వాములకు భిక్ష కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు సామర్ల కిరణ్ కుమార్, మద్దుల శ్రీనివాస్ గోపాల్, కొట్టు మనోజ్, వీరమాచనేని చందు, చలువాది పవన్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	27
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	20
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.45	4820	29
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.15	4822	26
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	21
ఏలూరు–బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	33
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు – తిరుపతి	16.00	4830	32

ప్రైవేటు కార్యక్రమంగా ప్రజాదర్బార్



ప్రజాదర్బార్ వేదికపై ఎమ్మెల్యే, మేయర్‌తో జనసేన నాయకుడు రెడ్డి అప్పలనాయుడు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాదర్బారు కార్యక్రమం కూటమి పార్టీల రాజకీయ కార్యక్రమంగా మారింది. స్థానిక ఏలూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎటువంటి పదవీ లేని కొంతమంది కూటమి పార్టీల నాయకులు కూడా పాల్గొని ప్రైవేట్ కార్యక్రమంగా మార్చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించే క్రమంలో ప్రజాప్రతినిధి కాకపోయినా జనసేన పార్టీ ఏలూరు నియోజకవర్గ కన్వీనర్ రెడ్డి అప్పల నాయుడు వేదికపై ఆశీనుడై ఉపన్యాసం ఇవ్వడం విమర్శలకు దారితీసింది. ఆయనను ఏ హోదాలో వేదికపైకి ఆహ్వానించారంటూ కార్యాలయ సిబ్బందిని పలువురు ప్రశ్నించారు. దీనికి తోడు ఎమ్మెల్యే అనుయాయులు అనేక మంది కార్యాలయంలోకి చొచ్చుకు వచ్చి వినతిపత్రాల ఇవ్వడడానికి వచ్చే వారికి అడ్డంకిగా మారారు. ఈ ప్రజాదర్బార్‌లో ప్రజాప్రతినిధులు కానివారికి స్థానం కల్పించిన తహసీల్దార్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే బడేటి చంటి అనర్హులను వేదికపై కూర్చోబెట్టి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని, తన అధికారాన్ని దుర్వినియోగం చేసి ఇటువంటివి ప్రోత్సహించడం సరికాదని పలువురు మండిపడుతున్నారు. ప్రజాదర్బారులో అధిక సంఖ్యలో భూ తగాదాలు, రేషన్ కార్డులు, ఇంటి పట్టాలు, పింఛన్లు మంజూరు కోరుతూ అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు



ఏలూరు ట్రాఫిక్ స్టేషన్ వద్ద కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఎస్సై, సార్జెంట్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని, కేసులు నమోదు చేస్తామని ఏలూరు ట్రాఫిక్ స్టేషన్ ఎస్సై టీఎస్ రంగారావు, సార్జెంట్ కె.వెంకటేష్ హెచ్చరించారు. ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో ట్రాఫిక్ పోలీసులు ఆదివారం రాత్రి ఏలూరు గూడ్స్‌షెడ్డు రోడ్డు వద్ద వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు. ఈ తనిఖీల్లో 10మంది మోటారు సైకిల్‌పై ప్రయాణించేవారు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో పట్టుబడ్డారు. పది మందిపై కేసు నమోదు చేసిన ట్రాఫిక్ పోలీసులు సోమవారం ఏలూరు ఫస్ట్ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు వారిని హాజరుపర్చామన్నారు. న్యాయమూర్తి పది మందికి రూ.32,300 జరిమానా విధించారని తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	72	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	48	చిక్కుడు కాయలు	60–96
వంకాయలు (కాంతులు)	56	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	40–60	ములక్కాడలు	07,10
బెండకాయలు	34	కంద	50
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	44
కాకర కాయలు	30–44	కీరా దోస	38
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	128
బీరకాయలు (పందిరి)	48	అల్లం	70–150
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	44–56	పాలకూర	15
దొండకాయలు	52	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	12
ఉల్లిపాయలు	35–56	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	36	బఠాణీ	--
ఆనబకాయ (1)	30	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	48

ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోండి

దెందులూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందటానికి నవంబర్ 6 తేదీ చివరి గడువు అని ఎన్నికల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె భాస్కర్ అన్నారు. సోమవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి సుమతి అధ్యక్షతన రాజకీయ పార్టీల ప్రతినిధితో కలిసి ఆయన అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ పూర్తి ఆధారాలతో సమర్పించి ఎమ్మెల్సీ ఓటు హక్కును పొందవచ్చున్నారు. నిర్దేశించిన కేంద్రాల్లో ఓటు హక్కు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. మరిన్ని వివరాలు తహసీల్దార్ కార్యాలయం, మీసేవ ఆన్‌లైన్ సెంటర్‌లో తెలుసుకోవచ్చని ఎన్నికల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె భాస్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శిని ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కృష్ణస్వామి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ హేమమాలిని, బీజేపీ దెందులూరు నియోజకవర్గం కన్వీనర్ కృష్ణ చైతన్య, మండల కన్వీనర్ బుజ్జి గోపాల్, టీడీపీ దెందులూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు ఇప్పిలి వెంకటేశ్వర రావు, పలువురు వీర్వోలు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులకు నిరసన



ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్షాలు

ఏలూరు (టూటౌన్): పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను నిరసిస్తూ ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పాలస్తీనాకు సంఘీభావంగా సోమవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని 10 వామపక్ష పార్టీల పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ రవి, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దేశం వైమానిక దాడులు మొదలుపెట్టి నేటికి సంవత్సరం కావస్తోందన్నారు. అమెరికా ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేందుకు ప్రపంచంలో యుద్ధాలను ప్రేరేపిస్తోందని విమర్శించారు. ప్రపంచంలో కొనసాగుతున్న యుద్ధాలను అరికట్టే దిశగా ఐక్యరాజ్యసమితి, ప్రధాని మోదీ ప్రయత్నం చేయాలని కోరారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు యర్రా శ్రీనివాసరావు, మూంగం అప్పారావు, కె.వి రత్నం, కాకి నాని, ఎం క్రాంతి, రాచేటి జాను, దూళ్ల వీరి నాయుడు, మంగరాజు రాము, నూకరాజు, శివ, కాకర్ల శ్రీను సీపీఐ నాయకులు బండి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.